క్లుప్తంగా

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కొత్తూరు: గ్రామాల్లో తక్కువ ధరకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి పట్టణానికి చెందిన ధీరావత్ లింగ మండలంలోని గూడూరు గ్రామంలో సుమారు 6.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కొనుగోలు చేశాడు. అనంతరం ఆటోలో తరలిస్తుండగా శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆటోతో పాటు లింగను అదుపులోకి తీసుకుని కొత్తూరు పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

అంగన్‌వాడీల సేవలు అద్భుతం: తాండ్ర విశాల

కేశంపేట: అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు మరువలేనివని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి కొనియాడారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం స్త్రీశిశు సంక్షేమంపై జిల్లా స్టాండింగ్ కమిటీ అధ్వర్యంలో సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో తాండ్ర విశాల పాల్గొని మాట్లాడుతూ... గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ దిలీప్, పద్మజ, కందుకూరు జడ్పీటీసీ జంగారెడ్డి, సీడీపీఓలు, దుర్గాబాయి మహిళ వికాస కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, విజ్ఞానంతో ఎదగాలని కమ్ ఫోర్ యూ స్వచ్ఛందం సంస్థ ఫౌండర్ అమీనా, డైరెక్టర్ కిరణ్మాయి ఆకాంక్షించారు. శనివారం మండలంలోని చిన్నమంగళారం వీరన్నపేట్ ప్రాథమిక పాఠశాలలో పేరంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ద్వారా విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఆకృతి, మల్లేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో విప్లవాత్మకమైన మార్పు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో దేశంలో విప్లవాత్మకమైన మార్పు రాబోతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ నాయకులు సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ హయాంలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించామని అన్నారు. ప్రపంచంలో వస్తున్న మార్పులను అనుగుణంగా విద్యార్థులను తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్రం నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రాంతీయ భాషలను పరిరక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కోట్లాది రూపాయలను కేంద్రం ఖర్చు చేస్తోందన్నారు. నాయకులు వంశీకృష్ణ, మురళీ, రుషికేశ్, శ్రీనివాసాచారి, హన్మంత్, శ్రీశైలం పాల్గొన్నారు.

దళితుడిపై దాడిని నిరసిస్తూ ఆందోళన

చేవెళ్ల: దళితుడిపై దాడికి పాల్పడిన మల్కాపూర్ సర్పంచ్ శివారెడ్డి, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాలు, పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ శనివారం చేవెళ్లలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం రాత్రి బోనాల పండుగ సందర్భంగా డ్యాన్స్ చేస్తున్న సంజీవ్ అనే దళితుడిపై సర్పంచ్ శివారెడ్డి, అతని అనుచరులు దాడి చేశారని తెలిపారు. ప్రస్తుతం సంజీవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. పూర్తిస్థాయి విచారణ జరుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు రాములు, జంగయ్య, ప్రభాకర్, ఆనంద్, రవి, అరుణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

జంగ నర్సింహా యాదవ్

నందిగామ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని తాళ్లగూడలో శనివారం నర్సింహా యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతోందని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పుతారని హెచ్చరించారు.

నూతన కమిటీ ఇదే..

యూత్ కమిటీ అధ్యక్షుడిగా ఆలూరి రాజు, ఉపాధ్యక్షులుగా రాజేందర్, ప్రవీణ్, కార్యదర్శిగా శివ, కోశాధికారిగా రాజేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తయ్య, ప్రవీణ్, దేవేందర్, యాదగిరి, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘స్వచ్ఛ’ పోటీకి సన్నద్ధం

- 14 జీపీల ఎంపిక
- ఎంపికైన గ్రామాల్లో కేంద్రం బృందం పర్యటన
- మార్కుల ఆధారంగా ర్యాంకులు
- పురస్కారాల కోసం పోటీ పడుతున్న గ్రామాలు



స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం కోసం పోటీ పడుతున్న గంట్లవెళ్ల గ్రామం

షాద్‌నగర్: స్వచ్ఛమైన పల్లెల నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఉత్తమ పనితీరును కనబర్చిన పంచాయితీలకు కేంద్ర ప్రభుత్వం పురస్కారాలను అందజేస్తోంది. ఇందులో భాగంగా కేంద్రం ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 పురస్కారానికి జిల్లాలోని పలు గ్రామ పంచాయితీలు పోటీ పడుతున్నాయి.

జిల్లాలో ఎంపికైన గ్రామాలు ఇవే

మండలం	గ్రామం
ఫరూఖ్‌నగర్	గంట్లవెళ్ల
చేవేళ్ల	పల్గుట్ట
నందిగామ	కన్హా
శంషాబాద్	సుల్తాన్‌పల్లి
అబుల్లాపూర్‌మెట్	మజిదాపూర్
మంచాల్	మంచాల్,ఆరుట్ల
మొయినాబాద్	చిలుకూరు
కేశంపేట	కేశంపేట
కందుకూరు	నెద్నూర్
కడ్తాల్	కడ్తాల్
తలకొండపల్లి	తలకొండపల్లి
శంకర్‌పల్లి	జన్‌వాడ
కొందుర్గు	కొందుర్గు

కేంద్ర బృందం పర్యటన

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వాహణలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారాల్లో భాగంగా ర్యాంకులను ప్రకటిస్తోంది. జిల్లాలో ఎంపికైన గ్రామాల్లో ఈ నెల 18, 19 తేదీల్లో కేంద్రం బృందం పర్యటించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ బృందం అధికారులు సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించనున్నారు.

క్షుణ్ణంగా పరిశీలన

పురస్కారాల కోసం పోటీ పడుతున్న గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, ఇంకుడు గుంతల నిర్మాణం, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, తడి పొడి చెత్త సేకరణ, సేంద్రీయ ఎరువుల తయారీ, ప్లాస్టిక్ నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత తదితర అంశాలను కేంద్రం బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

మూడు విభాగాల్లో ఎంపిక

జిల్లాలోని 13 మండలాల్లో 14 గ్రామ పంచాయితీలను జనాభా ప్రాతిపదికన మూడు విభాగాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల కోసం గ్రామాలను ఎంపిక చేశారు. ఐదు వేలకుపైగా జనాభా ఉన్న నాలుగు గ్రామాలను, రెండు వేల నుంచి ఐదు వేల లోపు ఉన్న ఐదు గ్రామాలను, రెండు వేలలోపు జనాభా ఉన్న ఐదు గ్రామాలు మొత్తం 14 గ్రామాలను స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ కోసం ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాలు పూర్తి స్థాయిలో మెరుగుపడేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

గాంధీ జయంతి రోజున పురస్కారాలు

అయితే కేంద్రం బృందాలు గ్రామాల్లో పర్యటించి ఉత్తమ గ్రామ పంచాయితీలను గుర్తించనున్నారు. ఉత్తమ పనితీరును కనబర్చిన పంచాయితీలకు వెయ్యి మార్కులు వేస్తారు. మార్కుల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. ఉత్తమ పంచాయితీలకు గాంధీ జయంతి రోజున ఢిల్లీలో పురస్కారాలు అందజేస్తారు.

“గ్రామాలను సన్నద్ధం చేస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అందజేసే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారాల పోటీ కోసం జిల్లాలో 14 గ్రామాలను ఎంపిక చేయడం జరిగింది. ఈ గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించనుంది. ఇందుకు గ్రామాలను సన్నద్ధం చేస్తున్నాం.

– ప్రభాకర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఓ

తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



పూజలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయిబాబ కాలనీలో నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవంలో ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి.. ఊరూరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. బోనాలు, బతుకమ్మ ఉత్సవాలకు విశ్వవ్యాప్తంగా ఖ్యాతి లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామ దేవతలను తమ ఇంటి ఆడపడుచుగా భావించి పూజించే విశిష్టమైన సంప్రదాయం తెలంగాణాకే సొంతమని వ్యాఖ్యానించారు. బోనాల ఉత్సవంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు క్రాంతి కుమార్, శివ, మాధవరెడ్డి, చంద్రయ్య, అమర్నాథ్‌రెడ్డి, కిరణ్, జగన్, శ్రీశైలం, రాంబాబు, సాయి ప్రసాద్, బాల్‌రాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శని త్రయోదశి పురస్కరించుకొని పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆటపాటలతో, భజనలతో ఘనంగా స్వామి వారి పల్లకి సేవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి మార్గంలో పయనించాలని, తద్వార ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధికి ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాధురి, నందకిషోర్, దామోదర్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్ నాయక్, నారాయణ, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, గోరియా నాయక్, బచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నూతన కమిటీ సభ్యులతో సీఐ శ్రీశైలం యాదవ్

సీఐ శ్రీశైలం యాదవ్

షాద్‌నగర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ శ్రీశైలం యాదవ్ సూచించారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో టాటా మ్యాజిక్ వాహనాల డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రయాణీకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని సూచించారు. డ్రైవర్లు వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నో పార్కింగ్ జోన్ వద్ద వాహనాలు నిలపొద్దని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

టాటా మ్యాజిక్ వాహనాల డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా నర్సింహ్మా, కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్... సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోం

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్



మొయినాబాద్ రూరల్: మాట్లాడుతున్న జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్



కొందుర్గు: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అమ్రిత జోసెఫ్

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో నులిపురుగుల మందులు పిల్లలందరీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ తెలిపారు. శనివారం మండల వైద్యాధికారి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ దామోదర్ పాల్గొని.. పలు సూచనలు చేశారు. రెండేళ్ల వయస్సు గల పిల్లల నుంచి 19 సంవత్సరాల బాలబాలికలందరికి నులిపురుగుల మాత్రలు అందజేయాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకోని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని మినహాయించి మిగతా వారికి భోజనం తిన్ని తర్వాత మాత్రలు వేయాలని సూచించారు. ఈ మందులు వేసుకుంటే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల బాగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల వైద్యాధికారి డాక్టర్ వాణి, బలరాం, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మాత్రల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు

కొందుర్గు: ఏడాది మొదలుకొని పంతొమ్మిది ఏళ్ల వయస్సు లోపు బాల, బాలికలందరికి నులిపురుగుల నివారణ మాత్రలు తినిపించాలని మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్ సూచించారు. శనివారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20న అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు మాత్రలు తినిపించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. రెండేళ్ల లోపు వయస్సు గల పిల్లలకు సగం మాత్ర, మిగతా వారికి పూర్తి మాత్ర తినిపించాలని సూచించారు. మొదటి రోజు ఎవరైన అనివార్య కారణాల వల్ల మాత్రలు తీసుకోకపోతే ఈ నెల 27 నిర్వహించే కార్యక్రమంలో తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి అపోహలకు గురికావద్దని, మాత్రలు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శభానా, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓలు ఆంజనేయులు, మహేశ్‌బాబు, పీహెచ్ఎన్ ప్రభులింగం పాల్గొన్నారు.

నులి పురుగులు నివారిద్దాం

షాద్‌నగర్‌రూరల్: పిల్లల్లో నులి పురుగులు నివారించాలని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నులి పురుగుల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కోసం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ మాత్రలను విధిగా పిల్లలతో మింగించాలని సూచించారు. పిల్లల కడుపులో నులి పురుగులు వస్తే వారిలో ఎదుగుదల ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌యంలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నియంత పాలనకు చరమగీతం పాడుదాం

చల్లా శ్రీకాంత్‌రెడ్డి



కమిటీ నూతన సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాగులపల్లిలో గ్రామ కమిటీ, ఎస్సీ, బీసీ సెల్ కమిటీలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజలకు అనేక హామీలిచ్చి విస్మరించారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి.. చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు.

వీధి కుక్కల దాడి.. వ్యక్తికి గాయాలు

షాద్‌నగర్ రూరల్: మండలంలోని వెలిజర్ల గ్రామంలో శనివారం వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. శనివారం ఉదయం గ్రామానికి చెందిన దొడ్డి శ్రీశైలం అనే వ్యక్తిపై కుక్కలు దాడి చేశాయి. పదిహేను రోజుల క్రితం ఇదే గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఇద్దరు గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని గ్రామస్తులులు డిమాండ్ చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచే పోటీ చేస్తా

మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం



మోకిల, కొండకల్ గ్రామాల్లో పర్యటిస్తున్న కెఎస్ రత్నం

శంకర్‌పల్లి/చేవెళ్ల: వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచే పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం ప్రకటించారు. సీఎం కేసీఆర్ తనకే టికెట్ ఇస్తారనే నమ్మకం ఉందన్నారు. శనివారం పల్లెపల్లెకు రత్నం అన్న అనే కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని కొండకల్, కొండకల్‌తండా, మోకిల, మోకిలతండాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందాయని, ఎన్నో పథకాలను ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. మాజీ ఎంపీపీ నర్సింహ, కొండకల్ ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, మోకిల ఎంపీటీసీ సరిత, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మిక సమస్యలు ప్రభుత్వానికి పట్టవా ?

మండల సీఐటీయూ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్



మొయినాబాద్ రూరల్: ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న కార్మికులు నాయకులు

మొయినాబాద్ రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండల సీఐటీయూ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు ఒంటికాలిపై నిరసన తెలిపారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. వారికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ కల్పించాలని కోరుతూ పది రోజులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రత్నం, ఆంజనేయులుగౌడ్, సుధాకర్, మమత, సుమతమ్మ, ఆంజనేయులు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె

షాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామస్వామి తెలిపారు. పంచాయతీ కార్మికులు సమ్మెకు ఏఐటీయూసీ నేతలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించపోవడం దారుణమన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులను ప్రభుత్వం, అధికారులు బెదిరించడాన్ని ఖండించారు. కార్మికులు సమ్మె హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య. సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, మల్లేష్, పంచాయతీ కార్మికులు తదితరులున్నారు.

కొనసాగుతున్న సమ్మె

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. శనివారం నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు భిక్షటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య, రవి, జంగయ్య, యాదయ్య, అంజయ్య, లాలు, లక్ష్మమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

షాద్‌నగర్: పంచాయితీ కార్మికులు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయితీ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం పదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు, నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధిలో పంచాయితీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్మికులందరికి ప్రమాదబీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబ, కార్మికులు సురేష్, యాదమ్మ, జంగమ్మ, కిష్టయ్య, చంద్రకళ, కమలమ్మ, భాగ్యమ్మ, కిష్టయ్య, పెద్దమ్మ, సిద్దమ్మ, మోహన్, అనిత, శోభ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలకు చెక్

కొందుర్గు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలను అదుపు చేయవచ్చని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. కొందుర్గు మండల కేంద్రంలో శనివారం కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందుర్గు గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామంగా ఎంపికైందని, ఇక నుంచి గ్రామంలో చెత్త చెదారం పడేయకూడదని సూచించారు. వీధుల్లో మురుగునీరు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ లాలయ్య, పంచాయతీ కార్యదర్శి సురేఖ, టీఏ రజిత, మాజీ ఎంపీటీసీ యాదయ్య పాల్గొన్నారు.

దళితబంధును వ్యతిరేకిస్తే దాడులే

బీఆర్ఎస్ నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తూరు: దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకాన్ని వ్యతిరేకించే పార్టీలపై దాడులు చేస్తామని మండల బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న దళితబంధుతో దళితులు ఆర్థికంగా బలపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితబంధును అమలు చేసి దళితులపై ఉన్న ప్రేమను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, యాదగిరి, మధుసూదన్‌రావు, పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.